సమన్వయంతో కేసులు త్వరగా పరిష్కరించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డికి పూలబొకె అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 1 : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్‌రెడ్డిని బుధవారం స్థానిక కోర్టు సముదాయంలో ఎస్పీ రాహుల్ హెగ్డే మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నమోదు, దర్యాప్తు, కోర్టు క్యాలెండర్ నంబర్, కేసు ట్రయల్స్, లోక్ అదాలత్ నిర్వహణ, కేసుల్లో నేరస్తులకు శిక్షల అమలు తదితర అంశాలపై చర్చించారు. కోర్టు అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని న్యాయమూర్తి ఈ సందర్భంగా సూచించారు. అనంతరం హోంగార్డు ఆంజనేయచారి కుమారుడు నితిన్ సాయి పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపినందుకు గాను ఎస్పీ పోలీస్ శాఖ తరుపున మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కు అందజేశారు.

మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా డాక్టర్ శ్యాంశ్రీ

సూర్యాపేట లీగల్, మే 1 : సూర్యాపేట మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా డాక్టర్ ఎం.శ్యాంశ్రీ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మారంపూడి శ్యాంశ్రీ 2003లో న్యాయవాదిగా రంగారెడ్డి జిల్లా కోర్టులో పని చేశారు. 2005లో శ్రీకాకుళం ప్రథమ శ్రేణి న్యాయమూర్తిగా, 2017లో సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జిగా, 2019లో పదోన్నతిపై సంగారెడ్డి అదనపు జిల్లా జడ్జిగా ఆ తర్వాత కొత్తగూడెం అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తూ బదిలీపై సూర్యాపేటకు వచ్చారు.

తుంగతుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయం

● మాజీ ఎమెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి, మే 1 : బీఆర్ఎస్ నుంచి కొందరు స్వార్థ నాయకులు వెళ్లిపోయినా నియోజకవర్గంలో బలమైన కార్యకర్తలు ఉన్నారని, భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే ప్రజలంతా కష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క పూర్తిస్థాయిలో రైతు బంధు ఇవ్వకపోగా, మరో పక్క రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి రైతులను మోసపుచ్చారని విమర్శించారు. గడిచిన పదేండ్లలో కొందరు బీఆర్ఎస్ నాయకులు పదవులు అనుభవించి నేడు కాంగ్రెస్‌లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. తమ స్వలాభాల కోసమే పార్టీలు మారుతున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందని, ఎవరూ అధైర్య పడొద్దని, ప్రతి కార్యకర్తను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గులాబీ దళపతి కేసీఆర్ రోడ్ షోలు రైతులు, ప్రజల్లో ధైర్యం నింపుతున్నాయన్నారు. తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు రాక్షస పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్‌రావు, బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు తాటికొండ సీతయ్య, రఘునందన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, నాయకులు గుండగాని రాములు, గోపగాని శ్రీను, దొంగరి శ్రీను, తునికి లక్ష్మి, తునికి సాయిలు, గాజుల యాదగిరి, గుండగాని దుర్గయ్య, శ్రీహరి, గుండగాని క్రాంతి, చెరుకు పరమేశ్, తడకమళ్ల రవికుమార్, శ్రీకాంత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కరుణాకర్

తిరుమలగిరి : సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బెడద కరుణాకర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తిరుమలగిరిలోని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నివాసంలో బుధవారం కిశోర్‌కుమార్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబి కండువా కప్పి కిశోర్‌కుమార్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రఘునందన్ రెడ్డి, నాయకులు దూపటి రవీందర్, బానోతు యాకూబ్‌నాయక్, బంధు రాము, దంతాలపల్లి యాకయ్య, వెంకటరాజ్యం, రాజు, కుర్ర నాగరాజు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీవాణి

నేరాల నియంత్రణకు పేదరిక నిర్మూలన దోహదం

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి

సూర్యాపేట లీగల్, మే 1 : నేరాల నియంత్రణకు పేదరిక నిర్మూలన దోహదం చేస్తుందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రలోని అంబేద్కర్‌నగర్‌లో అబినా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎలిజాల సురేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాల నియంత్రణ వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. అలాగే అక్షరాస్యతతో నేరాలను తగ్గించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ పద్మజ, సీఐ రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, దుబ్బాక ప్రసాద్, మల్లయ్య, శశిధర్ పాల్గొన్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సూర్యాపేట రూరల్, మే 1 : జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యా నిలయం ఉన్నత పాఠశాలకు చెందిన 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, అశోక్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పూర్వ విద్యార్థులు చిత్తలూరి కృష్ణ, తన్నీరు వెంకన్న, ప్రవీణ్, మమత, గోదాదేవి, రామకృష్ణ పాల్గొన్నారు.

చెర్వుగట్టు.. సమస్యల గట్టు

- క్షేత్రంలో కనిపించని ఉచిత మరుగుదొడ్లు
- కాలకృత్యాలతో గుట్ట చుట్టంతా దుర్గంధం
- పాకురుపట్టి బట్టలతో నిండిన ఆలయ కోనేరు
- ఎక్కడా లేని విధంగా కొబ్బరి కాయ రూ.50
- భక్తులకు సౌకర్యాలు నిల్.. దోపిడీ ఫుల్

గుట్టపై అపరిశుభ్రంగా ఉన్న వాతావరణం

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రం.. ప్రతి రోజు వేల మంది దర్శనం.. కోట్లలో ఆదాయం.. కానీ, కనీస వసతులు మృగ్యం. పైగా భక్తుల దోపిడీ అనంతం. ఇది నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి క్షేత్రం దుస్థితి. ఈ శైవ క్షేత్రానికి భక్తుల రద్దీ అధికంగా ఉన్నా కనీస వసతులు లేకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ క్షేత్రంపై రాత్రివేళ నిద్రచేసి ఉదయం స్వామివారిని దర్శించుకుంటే అనారోగ్య సమస్యలు తీరుతాయని భక్తుల నమ్మకం. అందుకే అమావాస్య, పౌర్ణమి, సెలవు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తారు. ఆ రోజుల్లో గుట్టపై నిద్రించడానికి కొంచెం స్థలం కూడా దొరకదు అంటే అతిశయోక్తి కాదు. భక్తులు వచ్చే వాహనాలతో ఘాట్ రోడ్డు నిండిపోతుంది.

మరుగుదొడ్లు ఉండవు..

గుట్టపై ముఖ్యంగా ఉచిత మరుగుదొడ్లు లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్న చిన్నపాటి సులభ్ కాంప్లెక్స్ భక్తుల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదు. ముఖ్యంగా మహిళలు చెప్పుకోలేని విధంగా బాధపడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి గంటల తరబడి లైన్లలో నిల్చోవాల్సి వస్తున్నది. నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి రూ.10 తీసుకుంటున్నా.. నిర్వహణ సక్రమంగా ఉండటం లేదు. అనేక గదులకు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ బాధ తాళలేక అనేక మంది నీళ్ల బాటిళ్లతో గుట్ట చుట్టపక్కల కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఫలితంగా ఆలయ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతున్నది. ఘాట్ రోడ్డులో రెండుచోట్ల తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మించినా నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయి.

పారిశుధ్యం అధ్వానం

చెర్వుగట్టుపై పారిశుధ్య నిర్వహణ ఘోరంగా ఉన్నది. కొబ్బరి చెక్కలు ఎండబెట్టిన పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక కోనేరు పరిస్థితి మరీ దారుణం. భక్తులు స్నానాలు ఆచరించే కోనేరు నీళ్లు నల్లగా, కంపుకొడుతున్నాయి. అందులోకి దిగితే పాకురు పట్టి జారుతున్నది. కాళ్లకు బట్టలు, ఇతర దుస్తులు తగులుతున్నాయి. డ్రాయర్లు, డైపర్లను కొందరు భక్తులు కోనేరులో, మరికొందరు దాని పక్కనే పడేస్తున్నారు.

భక్తుల నిలువు దోపిడీ

చెర్వుగట్టులో కొందరు వ్యాపారులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. భక్తులు తల నీలాల టికెట్‌కు రూ.50 చెల్లిస్తే.. క్షురకులు మరో రూ.50 డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి మెహమాటం లేకుండా రూ.50 ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ దేవస్థానంలో లేని విధంగా చెర్వుగట్టులో మాత్రం ఒక్క కొబ్బరికాయ రూ.50కి విక్రయిస్తున్నారు. చెర్వుగట్టు కింద ఆలయంలో కోడె మొక్కుల వద్ద టికెట్ ధర చెల్లించినప్పటికీ వివిధ వర్గాలవారు అదనంగా డబ్బులు దండుకుంటున్నారు. చెర్వుగట్టుకు వచ్చే భక్తులు కనీస వసతులు పొందకపోగా దోపిడికి, అసౌకర్యానికి గురవుతున్నారు.

కోడ్ ముగియగానే నిర్మాణాలు చేపడుతాం

చెర్వుగట్టులో 50 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం, నిధులు కూడా మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా పనులు చేపట్టడం లేదు. కోడ్ ముగియగానే మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతాం. చెర్వుగట్టుకు డ్రైనేజీ సమస్య ఉన్నదని, ఈ విషయమై గ్రామస్తులతో చర్చలు జరపుతున్నాం. కోనేరును 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తామని, కొందరు భక్తులు పసుపు కుంకుమలతో అలాగే కోనేరులోకి దిగడం వల్ల 2-3 రోజులకే నీళ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీ వేలం కారణంగా గుట్ట కింద రూ.50 కొబ్బరికాయ విక్రయిస్తున్నారని, గుట్ట మీద రూ.40కే విక్రయిస్తున్నారు. పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం - సిరికొండ నవీన్, ఆలయ ఈఓ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేట అర్బన్, మే 1 : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ అలుగుపెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

సమాజంలో మేధావుల పాత్ర కీలకం

సమాజంలో మేధావులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొల్లెద్దు వెంకటేశ్వర్‌రావు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, మేధావుల సహకారంతోనే తెలంగాణ రాష్ట్రం సాధించుకోగలిగామని దాని పునర్‌నిర్మాణంలో ఐక్యంగా ముందుకు సాగితే బంగారు తెలంగాణ సాధ్యం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య పాల్గొన్నారు.

సూర్యాపేటలో రూ 4.97 కోట్ల ఇంటి పన్ను వసూలు

బొడ్రాయిబజార్, మే 1 : 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నును ఏప్రిల్ 30 వరకు చెల్లిస్తే పన్నుపై 5 శాతం రిబేట్ ఇవ్వడంతో సూర్యాపేట మున్సిపాలిటీకి ఏప్రిల్ 1 నుంచి 30 వరకు 8,079 గృహాల నుంచి పన్నుగా రూ.4.97 కోట్లు వసూలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ బోళ్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాదిపై అదనంగా రూ.55 లక్షలు వసూలు అయినట్లు వెల్లడించారు. పన్ను వసూళ్లకు కృషి చేసిన బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బందిని ఆయన అభినందించారు. ఇంకా ఇంటి పన్ను బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని లేని పక్షంలో నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

గరిడేపల్లి, మే 1 : గరిడేపల్లి ఎంపీటీసీ కడియం స్వప్నావెంకట్‌రెడ్డి తండ్రి తాటి నర్సిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, హుజూర్‌నగర్ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, జక్కుల నాగేశ్వర్‌రావు, బెల్లంకొండ అమర్, పచ్చిపాల ఉపేందర్, దొడ్డా నర్సింహారావు, దొండపాటి అప్పిరెడ్డి, అప్పన్నపేట ఎంపీటీసీ కడప ఇసాక్, వి.పార్థసారధి, కడియం వెంకట్‌రెడ్డి, రాజ్‌మహ్మద్ ఉన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నాలుగు రోజుల క్రితం మృతి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు, వార్డు మాజీ సభ్యుడు తుళ్లూరి సైదులు కుటుంబాలను జగదీశ్‌రెడ్డి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టర్ అప్పిరెడ్డి, నాయకులు అబ్దుల్ నబీ, శ్రీనివాస్, నాగరాజు, పాపారావు, నరసయ్య, వీరయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువనేత చిరంజీవికి నివాళి

సూర్యాపేట రూరల్ : మండలంలోని బాలెంల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువనేత శివరాత్రి చిరంజీవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వెంకటాద్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, సంగాని రజినీకాంత్ పాల్గొన్నారు.

మఠంపల్లి : పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కె.సురేశ్‌కుమార్

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్

మఠంపల్లి, మే 1 : ఈ నెల 13 జరుగబోయే లోక్‌సభ ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చౌటపల్లి, పెదవీడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు కవిత, లక్ష్మణ్ ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

చిలుకూరు :లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డీపీఓ సురేశ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. చిలుకూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ బూత్ 111 నుంచి 116 వరకు గల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, కరెంట్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోప్స్ ఏర్పాటు చేసి దివ్యాంగ ఓటర్లకు ట్రై సైకిళ్లు సమకూర్చాలన్నారు. ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్ అందించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ గిరిబాబు, కార్యదర్శి షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : రవికృష్ణ ఫార్‌బాయిల్డ్ వద్ద కార్మిక అమరులకు నివాళులర్పిస్తున్న హమాలీ యూనియన్ నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

ఘనంగా మే డే

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, హమాలీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మే డే పోరాట స్ఫూర్తితో మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు పోరాటాలు తీవ్రం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలను దోపిడి చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న పాసిస్ట్ బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలనారు. సింగరేణి, మున్సిపల్, జీపీ, విద్యుత్, మిషన్ భగీరథ తదితర రంగాల కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

మఠంపల్లి : యాతవాకిళ్ల గ్రామంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● ఎంపీపీ రవీందర్‌రెడ్డి



సూర్యాపేట రూరల్ : ఎండ్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట రూరల్, మే 1 : జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కుంట్ల సుదర్శన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పాలనంటేనే రాక్షస పాలన

ఆత్మకూర్.ఎస్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ పాలన అంటేనే రాక్షస పాలన, కరువులకు నిలయమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మర్ల చంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చెప్పినవే కాకుండా చెప్పనివి ఎన్నో అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మండలంలోని బొప్పారం, గట్టికల్, పీపానాయక్ తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన కష్టాలు పోవాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మిర్యాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోసపోతే గోస పడుతాం

పెన్‌పహాడ్ : మోసపూరిత వాగ్దాలను నమ్మి చేయి గుర్తుకు ఓటు వేస్తే గోస పడుతామని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగేంధర్ అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని చీదెళ్ల, తంగెళ్లగూడెం, గాజులమల్కాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ సమన్వయకర్త ఇస్లావత్ రాంచంద్రనాయక్, నాయకులు ఇంద్రసేనారావు, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : చీదెళ్లలో కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాల అమలును వివరిస్తూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్.ఎస్ : బొప్పారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చలివేంద్రాలు ప్రారంభం

నేరేడుచర్ల, మే 1 : వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో నేరేడుచర్లలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యులు అరుణకుమారి, పద్మావతి, లావణ్య, లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, అశోక్, నర్సింహారావు, కవిత, జ్యోతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యనాయక్‌తండాలో..

అర్వపల్లి : అమ్మ ఒడి చిరునవ్వు ఫౌండేషన్ సూర్యనాయక్‌తండా ఆధ్వర్యంలో సూర్యనాయక్‌తండా ఐకెపీ సెంటర్‌లో బుధవారం చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సాయి బాలాజీ, కొమ్మాల ఎంపీటీసీ బిక్కునాయక్, ఉపాధ్యక్షుడు సైదులునాయక్, సెక్రటరీ నాగులు, కిషన్‌నాయక్, రమేశ్‌నాయక్, నర్సింహ, లింగస్వామి, రాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు నిప్పు

చివ్వెంల, మే 1 : హరితహారం మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాంతో సుమారు 20 మొక్కలు కాలిపోయాయి. ఈ ఘటన మండలంలోని భీమ్లాతండాలో బుధవారం జరిగింది. సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌తో నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు.

నాగారం ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాస్

నాగారం, మే 1 : నాగారం మండలం ఇన్‌చార్జి ఎంపీడీఓగా దారా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జి.శోభారాణి పదవీ విరమణ పొందడంతో ఆయనకు పూర్తి అదనపు బాధ్యతను అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మట్లాడుతూ వేసవిలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ తరగతులు

సూర్యాపేట అర్బన్, మే 1 : అక్షర ఫౌండేషన్, ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులను